క్లుప్తంగా

కల్యాణ మండప స్థలం పరిశీలన



పెదకళ్లేపల్లి(మోపిదేవి): పెదకళ్లేపల్లిలో నూతనంగా సీఎస్ఆర్ నిధులు రూ. 1.75 కోట్లతో నిర్మించనున్న కల్యాణ మండప స్థలాన్ని మచిలీపట్నం ఎంపీ వల్లభనేని బాలశౌరి బుధవారం పరిశీలించారు. ఇప్పటికే కొంత నిధులు విడుదలయ్యాయని, త్వరలోనే శంకుస్థాపన చేయనున్నట్లు గ్రామ పార్టీ కన్వీనర్ గండు దుర్గారావు తెలిపారు. నాయకులు తోట కృష్ణాంజనేయులు, తైలం బ్రహ్మారాజు, కార్యకర్తలు పాల్గొన్నారు.

నేడు భావదేవరపల్లిలో ఎమ్మెల్యే పర్యటన

నాగాయలంక: అవనిగడ్డ ఎమ్మెల్యే సింహాద్రి రమేష్‌బాబు గురువారం నాగాయలంక మండలంలో పర్యటిస్తారని ఇన్‌చార్జి ఎంపీడీఓ జేకే సీతారామ్‌కుమార్ బుధవారం తెలిపారు. మండలంలో నూతనంగా మంజూరైన పింఛన్లను భావదేవరపల్లి గ్రామంలో ఉదయం 8.30 గంటలకు లబ్ధిదారులకు ఎమ్మెల్యే పంపిణీ చేస్తారని చెప్పారు.

రేపు అవనిగడ్డలో జాబ్ మేళా

నాగాయలంక: ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి సంస్థ (ఏపీఎస్ఎస్‌డీసీ) ఆధ్వర్యంలో జిల్లాలోని నిరుద్యోగ యువతకు ఉద్యోగావకాశాలు కల్పించేందుకు శుక్రవారం అవనిగడ్డలోని ఎస్‌వీఎల్ క్రాంతి డిగ్రీ కళాశాలలో జాబ్‌మేళా నిర్వహిస్తామని ఆ సంస్థ జిల్లా అధికారి ఎస్.శ్రీనివాసరావు ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 9 గంటలకు జరిగే మేళాలో గ్రీన్‌టెక్ ఇండస్ట్రీస్, హెటిరో ల్యాబ్స్, గోల్డ్ ప్రిన్స్ జ్యువెల్ ఇండస్ట్రీ, అపోలో ఫార్మసీ, వరుణ్ మోటార్స్, డిమార్ట్, పేటీఎం, ఫ్లిప్‌కార్ట్ తదితర 13 కంపెనీలు పాల్గొంటాయన్నారు. పదో తరగతి, ఐటీఐ, డిప్లొమా, డిగ్రీ, ఫార్మసీ, బీ.టెక్, పీజీ పూర్తయిన వారు అర్హులన్నారు. ఎంపికైన వారికి రూ.9 వేల నుంచి రూ.30 వేల వరకు వేతనాలు, ఇతర సౌకర్యాలు ఉంటాయని చెప్పారు. ఆసక్తిగలవారు డబ్ల్యూడబ్ల్యూడబ్ల్యూ ఏపీఎస్ఎస్‌డీసీ.ఇన్ వెబ్‌సైట్‌లో తమ పూర్తి వివరాలతో నమోదు చేసుకుని సదరు జాబ్‌మేళాకు రెజ్యూమ్‌తో పాటు ఆధార్, అర్హత సర్టిఫికెట్స్ జిరాక్స్‌తో హాజరు కావాలన్నారు. మరిన్ని వివరాలకు సెల్: 63006 18985, 99664 89796 నంబర్లలో సంప్రదించాలని జిల్లా నైపుణ్యాభివృద్ధి అధికారి సూచించారు.

బూరమ్మ, గంగానమ్మ అమ్మవార్ల జాతర



అన్నవరం(మోపిదేవి): వెంకటాపురం శివారు అన్నవరం గ్రామంలోని బూరమ్మ తల్లి, గంగానమ్మ అమ్మవార్ల జాతర బుధవారం వైభవంగా నిర్వహించారు. ప్రతి సంవత్సరం శ్రావణ మాసంలో అమ్మవార్లకు సంబరాలు నిర్వహించి నైవేద్యాలు సమర్పిస్తారు. అందులో భాగంగా బుధవారం ఆలయ కమిటీ ఆధ్వర్యంలో గ్రామంలో మహిళలు చలి నైవేద్యాలతో ఊరేగింపుగా దేవస్థానానికి చేరుకున్నారు. జాతర మహోత్సవంలో అన్నవరం, చిర్లపాలెం గ్రామస్తులతో పాటు చుట్టుపక్కల గ్రామస్తులు పాల్గొన్నారు.

అమ్మవారికి ప్రత్యేక అలంకరణ



టేకుపల్లి(మోపిదేవి): టేకుపల్లిలోని బాలా పార్వతి సమేత రామేశ్వరస్వామివారి ఆలయంలో బుధవారం అమ్మవారిని పసుపు కొమ్ములతో అలంకరించారు. శ్రావణమాసం సందర్భంగా ఉదయం ప్రత్యేక పూజలు జరిగాయి. అనంతరం భక్తులు సమర్పించిన పసుపుకొమ్ములను అమ్మవారికి చీరగా అలంకరించారు. భక్తులకు తీర్థ ప్రసాదాలు అందజేశారు.

ఉత్తమ ఉపాధ్యాయినికి సన్మానం

గూడూరు: గురుపూజోత్సవాన్ని పురస్కరించుకుని ఉత్తమ ఉపాధ్యాయుడిగా జిల్లా స్థాయిలో పురస్కారం అందుకున్న ఆకుమర్రు మండల పరిషత్ ప్రాథమికోన్నత పాఠశాల హిందీ పండిట్ ఎంజీ మెహెదిని పాఠశాల ఉపాధ్యాయులు, విద్యార్థులు బుధవారం ఘనంగా సత్కరించారు. పాఠశాల ప్రధానోపాధ్యాయుడు టి.దుర్గాప్రసాద్ మాట్లాడుతూ జిల్లా స్థాయిలో ఉత్తమ ఉపాధ్యాయ పురస్కారం పాఠశాలకు రావడం గర్వకారణమన్నారు. జాతీయ భాష హిందీలో రాణించేలా విద్యార్థులను తీర్చిదిద్దుతున్న మెహెదీ సేవలు ఆదర్శప్రాయమని చెప్పారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు సుధీర్, వాహబ్, నాగమణి, ఉమాదేవి, రమాదేవి, వెంకటేశ్వరరావు, విద్యార్థులు పాల్గొన్నారు.

ప్రజల భవిష్యత్‌కు తిరుగులేని గ్యారంటీ

- మంత్రి జోగి రమేష్
- నూతన పింఛన్ల పంపిణీ

పెడన: ప్రజల భవిష్యత్‌కు తిరుగులేని గ్యారంటీని వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వం మాత్రమే అందించగలదని రాష్ట్ర గృహ నిర్మాణ శాఖా మంత్రి జోగి రమేష్ అన్నారు. బుధవారం ఆయన నియోజకవర్గ వ్యాప్తంగా విస్తృతంగా పర్యటించి కృత్తివెన్ను, బంటుమిల్లి, పెడన రూరల్, టౌన్, గూడూరు మండలాల్లో నూతనంగా మంజూరైన సామాజిక పింఛన్లను పంపిణీ చేశారు. పెడన రూరల్‌లో 150 మందికి పెడన వ్యవసాయ మార్కెట్ కమిటీ సమావేశం హాల్‌లోను, పట్టణంలో మంజూరైన 80 మందికి మున్సిపల్ కార్యాలయం ఆవరణలోనూ సామాజిక పింఛన్లను మంత్రి అందజేసి మాట్లాడారు. మరిన్ని సంక్షేమ పథకాలు అమలు కావాలంటే మళ్లీ జగనన్నే సీఎంగా ఉండేలా మీరంతా ఆశీర్వదించాలని కోరారు. దేశంలో 28 రాష్ట్రాలుంటే మన రాష్ట్రంలో మాత్రమే ఇంత పెద్ద మొత్తంలో సామాజిక పెన్షన్లు పంపిణీ చేస్తోందని వివరించారు. పెడన నియోజకవర్గంలోనే 33,284 మంది పింఛన్లు తీసుకుంటున్నారని తెలిపారు. ఎంపీపీ వాణి, మార్కెట్ కమిటీ చైర్‌పర్సన్ చారుమతి, మున్సిపల్ చైర్‌పర్సన్ నాగకుమారి, వైస్ చైర్మన్లు ఖాజా, జ్యోతి, ఎంపీడీఓ రెడ్డయ్య, ఇన్‌చార్జి కమిషనర్, టీపీఓ ఏసుబాబు, జిల్లా మైనార్టీ విభాగం అధ్యక్షుడు అయూబ్‌ఖాన్, ఎంపీటీసీలు, సర్పంచులు, కౌన్సిలర్లు, నాయకులు పాల్గొన్నారు.



పెడనలో లబ్ధిదారుకు పింఛన్ అందజేస్తున్న మంత్రి జోగి రమేష్

పేదల కుటుంబాల్లో సంతోషమే లక్ష్యం

కృత్తివెన్ను: ప్రతి పేదవాని కుటుంబంలో సంతోషం నింపడమే లక్ష్యంగా ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి పాలన చేస్తున్నారని రాష్ట్ర గృహ నిర్మాణ శాఖా మంత్రి జోగి రమేష్ అన్నారు. కుల మతాలు, పార్టీలకు అతీతంగా అర్హతే ప్రామాణికంగా అన్నివర్గాలకు సంక్షేమ పథకాలు అమలు చేస్తున్నారని, ఈ విధంగా దేశంలో మరెక్కడా సంక్షేమ పథకాలు అమలు జరగడం లేదని చెప్పారు. మండలంలో నూతనంగా మంజూరైన సామాజిక పింఛన్లను మంత్రి 197 మంది లబ్ధిదారులకు బుధవారం అందజేశారు. కృత్తివెన్ను శివాలయం వద్ద జరిగిన కార్యక్రమంలో మంత్రి మాట్లాడుతూ ప్రతి నెలా ఒకటో తేదీ వేకువజామునే మీ ఇంటి తలుపు తట్టి పింఛన్ అందించడం జగనన్నకు మీపై ఉన్న ప్రేమను తెలియజేస్తోందన్నారు. ముఖ్యమంత్రి జగనన్నను మరోసారి ఆశీర్వదించాలని కోరారు. మండలంలో మొత్తం 321 మందికి ఈ నెల నూతన పింఛన్లు మంజూరుకాగా 124 మందికి ఒకటో తేదీన ఇవ్వగా మిగిలిన 197 మందికి మంత్రి బుధవారం అందజేశారు.

అవినీతి చేస్తే ఎవ్వరైనా జైలుకే....

మీ భవిష్యత్‌కు నాదీ గ్యారంటీ అంటూ ప్రగల్భాలు పలికిన చంద్రబాబు తాను చేసిన అవినీతికి జైలు పాలైన విషయాన్ని ప్రజలంతా గమనించాలన్నారు. ప్రజల సొమ్మును అక్రమ మార్గాల ద్వారా ఆయనతో పాటు వారి కుటుంబ సభ్యుల ఖాతాలకు మళ్లించారని విమర్శించారు. ఇది కేవలం ఒకటి మాత్రమేనని, చంద్రబాబు అవినీతి బాగోతాలు మరెన్నో ఉన్నాయని, అవన్నీ త్వరలోనే బయటకు వస్తాయని చెప్పారు. ఇటువంటి అవినీతి పరులను వెనకేసుకువచ్చే వారిని కనీసం మీ ఇంటి పరిసరాలలోకి సైతం రానీయవద్దన్నారు. చంద్రబాబు, ఆయన కొడుకు లోకేష్‌లు రాష్ట్ర ప్రజల సొమ్మును అడ్డంగా దోచేసుకున్నారని ధ్వజమెత్తారు. కార్యక్రమంలో ఎంపీపీ గరుడప్రసాద్, జెడ్పీటీసీ రత్నకుమారి, ఏఎంసీ చైర్మన్ గంగాధర్, మండల కన్వీనర్ వెంకట్రాజు, కాపు కార్పొరేషన్ డైరెక్టర్ పి. మహేష్, ఎంపీటీసీ విజయకుమారి, ఎంపీడీఓ పిచ్చిబాబు, తహసీల్దార్ రామకోటేశ్వరరావు, అధికారులు, నాయకులు పాల్గొన్నారు.

వారికే గ్యారంటీ లేదు..

గూడూరు: భవిష్యత్‌కు గ్యారంటీ అని చెప్పిన చంద్రబాబుకే గ్యారంటీ లేదని, అలాంటి వ్యక్తి మీ భవిష్యత్‌కు గ్యారంటీ ఎలా ఇస్తాడని మంత్రి జోగి రమేష్ అన్నారు. గూడూరు మండలంలో కొత్తగా మంజూరైన 251 సామాజిక పింఛన్లను మంత్రి జోగి రమేష్ లబ్ధిదారులకు అందజేశారు. ఈ సందర్భంగా గూడూరులోని రైతు కమ్యూనిటీ హాల్‌లో జరిగిన సభలో మంత్రి మాట్లాడుతూ చంద్రబాబు పాపం పండిందని, అధికారంలో ఉండగా అతను పాల్పడిన మోసాలు ఒక్కొక్కటిగా బయటకు వస్తున్నాయని చెప్పారు. చంద్రబాబు చేసిన అక్రమాలపై గ్రామాల్లో చర్చ జరగాలని, అప్పుడే అతను ఎంత దుర్మార్గుడు అన్న విషయం అందరికీ తెలుస్తుందన్నారు. కార్యక్రమంలో ఎంపీపీ సంగా మధుసూదనరావు, జెడ్పీటీసీ సభ్యుడు వేముల సురేష్ రంగబాబు, కేడీసీసీబీ డైరెక్టర్ తలుపుల వెంకట కృష్ణారావు, ఏపీఎస్ఎఫ్‌సీ డైరెక్టర్ కారుమంచి కామేశ్వరరావు, రైల్వే బోర్డు సభ్యుడు మోటేపల్లి రత్నారావు, వైస్ ఎంపీపీలు నేతల కుటుంబరావు, పిచ్చుక గంగాధరరావు, పర్ణం పెదబాబు, ఎంపీడీఓ డి.సుబ్బారావు పాల్గొన్నారు.

ఉత్తరచిరువోలులంక(మోపిదేవి): రాష్ట్ర ప్రభుత్వం కొత్తగా మంజూరు చేసిన పింఛన్లను లబ్ధిదారులకు బుధవారం అందజేశారు. ఉత్తర చిరువోలులంక సచివాలయంలో మొత్తం 45 సామాజిక పింఛన్లు మంజూరయ్యాయి.

ఉత్తర చిరువోలులంక పంచాయతీలో 36 మందికి సర్పంచ్ చింతా శ్రీనివాసరావు బుధవారం పింఛన్లను అందజేశారు. పీఏసీఎస్ చైర్‌పర్సన్ రెడ్రౌతు వెంకట రమణ, గ్రామ సచివాలయ కన్వీనర్లు ఎన్. రాము, వీరబ్రహ్మం, గ్రామ కార్యదర్శి రామకోటేశ్వరావు పాల్గొన్నారు. కోసూరువారిపాలెంలో సర్పంచ్ కోసూరు అనూష చేతుల మీదుగా నూతనంగా మంజూరైన 24 పింఛన్లను లబ్ధిదారులకు అందజేశారు. మండల సచివాలయ కన్వీనర్ కోసూరు శివనాగమల్లేశ్వరరావు, గ్రామ కార్యదర్శి ఉప్పాల వెంకటేశ్వరరావు పాల్గొన్నారు.

అర్హతే ప్రామాణికం..

బంటుమిల్లి: అర్హులైన ప్రతి ఒక్కరికీ పార్టీలకతీతంగా సంక్షేమ పథకాలు అందజేస్తున్నామని మంత్రి జోగి రమేష్ అన్నారు. బుధవారం స్థానిక వ్యవసాయ మార్కెట్ కమిటీ ఆవరణలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో మండలంలో నూతనంగా మంజూరైన 176 సామాజిక పింఛన్లను లబ్ధిదారులకు మంత్రి అందజేసి మాట్లాడారు. సంక్షేమ పథకాల ఫలాలు నేరుగా అందాలంటే జగనన్నను మరోసారి ఆశీర్వదించాలని కోరారు. ఎంపీపీ వి. చినబాబు, జెడ్పీటీసీ ఎం. వెంకటరమణ, ఏఎంసీ చైర్మన్, వైస్ చైర్మన్ కె. గంగాధర్, పి. బాబూరావు, వైస్ ఎంపీపీ ఓ. చిన్నారిబాబు, సుజ్ఞానం మహేష్, సర్పంచ్ వి. కృష్ణవేణి, మండల సచివాలయ, ఆర్‌బీకే కన్వీనర్లు, ఎంపీటీసీలు, నాయకులు పాల్గొన్నారు.



బంటుమిల్లిలో పింఛన్లు పంపిణీ చేసి మాట్లాడుతున్న మంత్రి జోగి రమేష్

పేదల పక్షపాతి సీఎం జగన్

మచిలీపట్నంటౌన్: ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి సంక్షేమ పథకాలు అమలు చేస్తూ పేదల పక్షపాతిగా ప్రజల హృదయాల్లో సుస్థిర స్థానం పొందారని వైఎస్సార్ సీపీ యువజన విభాగం జోనల్ ఇన్‌చార్జి పేర్ని కృష్ణమూర్తి (కిట్టు) అన్నారు. నగరంలోని 50 డివిజన్లలో 920 మందికి మంజూరైన వివిధ రకాల నూతన పింఛన్లను నాలుగు ప్రాంతాల్లో ఏర్పాటు చేసిన కార్యక్రమాల్లో మేయర్ చిటికిన వెంకటేశ్వరమ్మతో కలిసి లబ్ధిదారులకు ఆయన అందజేశారు.

తొలుత రాజుపేట షాదీఖానాలో జరిగిన కార్యక్రమంలో పాల్గొన్న ఆయన మాట్లాడుతూ జగనన్న ప్రభుత్వం రాష్ట్రంలో అర్హత ఉన్న ప్రతి ఒక్కరికీ పింఛన్లను అందజేస్తోందని చెప్పారు. విద్య, వైద్య రంగాలకు ప్రభుత్వం అధిక ప్రాధాన్యత ఇస్తోందన్నారు. పేదల ఆరోగ్య సమస్యల పరిష్కారానికి గాను త్వరలోనే జగనన్న ఆరోగ్య సురక్ష పథకాన్ని అమలు చేయనున్నారని చెప్పారు. వైఎస్సార్ సీపీ ప్రభుత్వం మీ కుటుంబాలకు మేలు చేసిందని భావిస్తే వచ్చే ఎన్నికల్లో సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని మళ్లీ ఆశీర్వదించాలని కోరారు. కార్యక్రమంలో డెప్యూటీ మేయర్లు మాడపాటి విజయలక్ష్మి, శీలం భారతి, మార్కెట్ యార్డ్ మాజీ చైర్మన్ షేక్ అచ్చేబా, ఆయా డివిజన్ల కార్పొరేటర్లు, వైఎస్సార్ సీపీ నాయకులు పాల్గొన్నారు.



మహిళకు పింఛన్ అందజేస్తున్న మేయర్ వెంకటేశ్వరమ్మ, పేర్ని కిట్టు

'జగనన్న ఆరోగ్య సురక్ష'కు సిద్ధంగా ఉండాలి

కలెక్టర్ రాజాబాబు

చిలకలపూడి(మచిలీపట్నం): ఈ నెల 30వ తేదీ నుంచి ప్రారంభం కానున్న జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమానికి అవసరమైన చర్యలు తీసుకుని సిద్ధంగా ఉండాలని కలెక్టర్ పి. రాజాబాబు అధికారులను ఆదేశించారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి బుధవారం తాడేపల్లి క్యాంపు కార్యాలయం నుంచి జిల్లా కలెక్టర్లతో నిర్వహించిన వీడియో కాన్ఫరెన్స్‌లో కలెక్టర్ రాజాబాబు, జాయింట్ కలెక్టర్ అపరాజితసింగ్ పాల్గొన్నారు. అనంతరం అధికారులకు కలెక్టర్ దిశానిర్దేశం చేశారు. జిల్లాలో జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమం ఐదు దశల్లో జరుగుతుందన్నారు. సెప్టెంబరు 30వ తేదీన హెల్త్ క్యాంపు ప్రారంభమవుతుందని, ఈ కార్యక్రమం ప్రారంభం కావడానికి 15 రోజుల ముందు హెల్త్ ఆఫీసర్లు, ఏఎన్ఎంలు, ఆశావర్కర్లు ఇంటింటిని సందర్శించి కుటుంబ సభ్యుల ఆరోగ్య వివరాలను సేకరించాల్సి ఉంటుందన్నారు. సేకరించిన వివరాల ఆధారంగా హెల్త్‌క్యాంపులో వైద్యం అవసరమైన వారికి డాక్టర్లతో చికిత్స చేయించి మందులు అందజేస్తామన్నారు. వీడియో కాన్ఫరెన్స్‌లో డీఎంహెచ్ఓ డాక్టర్ జి. గీతాబాయి, ఐసీడీఎస్ పీడీ ఎస్. సువర్ణ, డీపీఓ నాగేశ్వరనాయక్, డీఈఓ తాహెరాసుల్తానా పాల్గొన్నారు.

సానుకూల దృక్పథంతో ముందుకురావాలి

చిలకలపూడి(మచిలీపట్నం): మచిలీపట్నం-విజయవాడ జాతీయ రహదారి నిడుమోలు గ్రామంలోని మసీదు తొలగింపుపై కమిటీ సభ్యులు సానుకూల దృక్పథంతో ఆలోచించి ముందుకు రావాలని కలెక్టర్ రాజాబాబు కమిటీ ప్రతినిధులను కోరారు. బుధవారం రాత్రి కలెక్టరేట్‌లోని ఆయన చాంబర్‌లో కమిటీ ప్రతినిధులతో సమావేశం నిర్వహించారు. మసీదు కమిటీ అధ్యక్షులు తాజ్‌ముల్లా షరీఫ్ మాట్లాడుతూ మసీదు, సమాధుల ప్రాంతాన్ని తొలగించకుండా అలైన్‌మెంట్ మార్చి పరిష్కారం చేయాలని కలెక్టర్‌ను కోరారు. కలెక్టర్ స్పందిస్తూ రహదారి అభివృద్ధిలో భాగంగా నిర్మాణం జరగాల్సిందేనని, ఇందుకు ఏదైనా నష్టపరిహారం లేదా ప్రత్యామ్నాయ ఏర్పాట్లు గాని చేస్తామన్నారు. మసీదును యథాతథంగా తాజా సాంకేతిక పరిజ్ఞానంతో పవిత్రతకు ఎలాంటి భంగం కలుగకుండా వేరొకచోటకు తరలించేందుకు కమిటీ సభ్యులందరూ అంగీకరించాలన్నారు. తాను వచ్చే సోమవారం మసీదు ప్రాంతాన్ని పరిశీలిస్తానని చెప్పారు. సమావేశంలో జాయింట్ కలెక్టర్ అపరాజితసింగ్, మొవ్వ తహసీల్దార్ ఆంజనేయప్రసాద్, మసీదు కమిటీ కార్యదర్శి ఇక్బాల్ బాషా, సభ్యులు పాల్గొన్నారు.



వీడియో కాన్ఫరెన్స్‌లో పాల్గొన్న కలెక్టర్ రాజాబాబు. చిత్రంలో జేసీ అపరాజితసింగ్

నాడు-నేడు పనులు వేగవంతం చేయాలి

మోపిదేవి: మన బడి నాడు-నేడు రెండో విడత పనులను వేగవంతం చేయాలని ఇన్‌చార్జి ఎంఈఓ విద్యాసాగర్ అన్నారు. మండల విద్యా వనరుల కేంద్రంలో బుధవారం హెచ్ఎంలు, సీఆర్పీల సమీక్షా సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ రెండో విడతలో పాఠశాలలకు మంజూరైన నిధులు, పనుల వివరాలు అడిగి తెలుసుకుని పలు సూచనలు చేశారు. నాడు-నేడు పనులు జరుగుతున్న పాఠశాలల హెచ్ఎంలు, సీఆర్పీలు పాల్గొన్నారు.

ఉత్సాహంగా బాలికల ఆటల పోటీలు

గూడూరు: అండర్-14, అండర్-17 విభాగాలల్లో బాలికల ఆటల పోటీలు గూడూరు జెడ్పీ ఉన్నత పాఠశాలలో బుధవారం ప్రారంభమయ్యాయి. కబడ్డీ, ఖోఖో, వాలీబాల్, త్రోబాల్, బాల్ బ్యాడ్మింటన్, షటిల్ బ్యాడ్మింటన్, టెన్నికాయిట్ తదితర విభాగాల్లో మండల స్థాయిలో నిర్వహించిన ఆటల పోటీలను పాఠశాల ప్రధానోపాధ్యాయిని డి.పుష్పలత ప్రారంభించారు. కార్యక్రమంలో నియోజకవర్గ స్పోర్ట్స్ కో-ఆర్డినేటర్ సీహెచ్ మురళి, మండల స్పోర్ట్స్ ఇన్‌చార్జి మత్తి అరుణ, రాజేష్ పాల్గొన్నారు.

ట్యాబ్‌ల వినియోగంపై శిక్షణ

బంటుమిల్లి: ప్రభుత్వ పాఠశాలల్లో ట్యాబ్‌ల వినియోగంపై ఉపాధ్యాయులకు బుధవారం శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. స్థానిక మండల రిసోర్స్ సెంటర్ (ఎంఆర్సీ)భవనంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో సంస్థ నోడల్ అధికారి మహ్మద్ దావూద్ ఉన్నత, ప్రాథమికోన్నత పాఠశాలల హెచ్ఎంలు, నోడల్ ఉపాధ్యాయులకు శిక్షణ ఇచ్చారు. ట్యాబ్‌ల వినియోగంలో ఎదురయ్యే ఇబ్బందులు, ట్యాబ్ పోయినా, పనిచేయక పోయినా, పగిలిపోయినా సమస్యను ఉన్నతాధికారులకు, కంపెనీ దృష్టికి ఎలా తీసుకువెళ్లాలో అవగాహన కల్పించారు. ఎంఈఓ బి. త్రిపురసుందరీదేవి, సీఆర్పీలు పాల్గొన్నారు.

మద్యం సేవించి వాహనాలు నడిపితే శిక్ష తప్పదు

పెడన: రోడ్లపై మద్యం సేవించి వాహనాలు నడిపినా, అల్లరి చేస్తూ వాహనదారులకు ఇబ్బంది కలిగించినా కఠిన చర్యలు తప్పవని పెడన సీఐ మహమ్మద్‌హబీబ్ బాషా హెచ్చరించారు. మంగళవారం అర్ధరాత్రి పెడన జాతీయ రహదారిపై మద్యం సేవించి అల్లరి చేస్తున్న పలువురిని సీఐ అదుపులోకి తీసుకుని కేసులు నమోదు చేశారు. ఈ సందర్భంగా ఆయన తన కార్యాలయంలో కౌన్సెలింగ్ ఇచ్చారు.

ఉన్నత విద్యకు బలమైన పునాది వేస్తున్నాం

- ఎంపీ వల్లభనేని బాలశౌరి
- డిజిటల్ ల్యాబ్ నిర్మాణానికి శంకుస్థాపన

కొత్తమాజేరు(చల్లపల్లి): పేద విద్యార్థులు ఉన్నత విద్య దిశగా అడుగులు వేసేందుకు అనువుగా బలమైన పునాది వేస్తున్నామని మచిలీపట్నం ఎంపీ వల్లభనేని బాలశౌరి అన్నారు. బుధవారం స్థానిక జెడ్పీ హైస్కూల్ ఆవరణలో కనెక్టింగ్ ఆంధ్రా కార్యక్రమంలో భాగంగా విద్యార్థుల కోసం షిప్పింగ్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా సీఎస్ఆర్ నిధులు రూ.38 లక్షలు, ఎంపీ బాలశౌరి నిధులు రూ.5 లక్షలతో నూతన డిజిటల్ ల్యాబ్ నిర్మాణానికి ఎంపీ బాలశౌరి, అవనిగడ్డ ఎమ్మెల్యే సింహాద్రి రమేష్‌బాబు శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఎంపీ మాట్లాడుతూ మాజేరు జెడ్పీ హైస్కూల్‌లో కేంద్ర ప్రభుత్వం ద్వారా మరో రూ.కోటి నిధులు తెచ్చి సైన్స్ ల్యాబ్, డిజిటల్ లైబ్రరీ నిర్మాణం, క్రీడా మైదానం సమగ్ర అభివృద్ధి చేస్తామని ప్రకటించారు. ప్రతి మండలంలో ఒక జెడ్పీ హైస్కూల్‌ను సమగ్రంగా అభివృద్ధి చేసేందుకు కేంద్ర ప్రభుత్వ నిధులతో కృషి చేస్తానని తెలిపారు. గ్రామీణ ప్రాంత విద్యార్థులు ఐఐటీ, ఐపీఎస్, ఐఏఎస్ స్థాయి విద్య అభ్యసించేందుకు అనువుగా హైస్కూల్ స్థాయిలోనే బలమైన పునాది ఏర్పాటు చేయనున్నామని వివరించారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ సభ్యురాలు రాజులపాటి కల్యాణి, ఏఎంసీ చైర్మన్ వేమూరి వెంకట్రావ్, సర్పంచ్‌లు కళ్లేపల్లి లక్ష్మి, డొక్కు నాగేశ్వరరావు, వల్లూరు ఉమా, ఎంపీటీసీ తమ్ము లక్ష్మి, పీఏసీఎస్ చైర్మన్లు అరజా శివశంకర్, పేరం నాగిరెడ్డి, ఎంపీడీఓ చేకు చిన రాట్నాలు, ఎంఈఓ పి.వెంకటేశ్వరరావు పాల్గొన్నారు.

జాబ్‌మేళాలో 29 మందికి ఉద్యోగాలు

మచిలీపట్నంటౌన్: నగరంలోని నోబుల్ కళాశాలలో బుధవారం నిర్వహించిన జాబ్‌మేళాలో 29 మంది ఉద్యోగాలకు ఎంపికయ్యారని జిల్లా ఉపాధి అధికారి దేవరపల్లి విక్టర్‌బాబు తెలిపారు. జాబ్‌మేళాకు 109 మంది హాజరుకాగా 29 మందిని వివిధ ఉద్యోగాలకు ఎంపిక చేశామన్నారు. ఎంపికైన యువతీ, యువకులకు యంగ్ ప్రొబిషన్ ఎస్. జయరాజు చేతుల మీదుగా ఉద్యోగ నియామక పత్రాలు అందజేశారు. విక్టర్‌బాబు మాట్లాడుతూ యువతను సన్మార్గంలో పయనింపజేసేందుకు ఉపాధి, ఉద్యోగ అవకాశాలు కల్పించేందుకు ప్రభుత్వం కృషి చేస్తోందన్నారు. ఉద్యోగాలు కల్పించేందుకు జాబ్‌మేళా కార్యక్రమాలు నిర్వహిస్తున్నామని చెప్పారు. పలు కంపెనీలకు చెందిన ప్రతినిధులు హాజరై యువతీ, యువకులకు ఉద్యోగ అవకాశాలు కల్పించారన్నారు. జిల్లా ఉపాధి కార్యాలయం, ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి సంస్థ సంయుక్త ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో బి. ప్రసాద్, నోబుల్ కళాశాల ప్రిన్సిపాల్ ఎర్నెస్ట్, ఉపాధి కార్యాలయ సిబ్బంది, ఉద్యోగులు పాల్గొన్నారు.



ఎంపికైన అభ్యర్థినికి నియామకపత్రం అందజేస్తున్న దృశ్యం

పోషకాహారంతో సంపూర్ణ ఆరోగ్యం

కృత్తివెన్ను: నాణ్యమైన పోషకాహారాన్ని తీసుకోవడం ద్వారా సంపూర్ణ ఆరోగ్యం కలుగుతుందని ఐసీడీఎస్ సీడీపీఓ సముద్రవేణి అన్నారు. బుధవారం కృత్తివెన్ను అంగన్‌వాడీ కేంద్రంలో నిర్వహించిన పోషకాహార మాసోత్సవాలలో ఆమె పాల్గొని మహిళలకు పలు ఆరోగ్య సూత్రాలను వివరించారు. ముఖ్యంగా గర్భిణులు, బాలింతలు తక్కువ ఖర్చుతో లభించే పోషక విలువలు కలిగిన ఆహారాన్ని తీసుకోవాలన్నారు. దీని ద్వారా రక్తహీనత అనేది లేకుండా తల్లీ బిడ్డలు ఆరోగ్యంగా ఉంటారన్నారు. ఆకుకూరలు తప్పకుండా తీసుకోవాలని, వీటితో పాటు పండ్లు, పాలు తీసుకోవాలని చెప్పారు. ప్రసవం తరువాత పుట్టిన బిడ్డకు ఆరుమాసాల వరకు తల్లిపాలను ఇవ్వాలన్నారు. ఐసీడీఎస్ సూపర్‌వైజర్ శ్యామలగౌరీ, అంగన్‌వాడీ కార్యకర్తలు, గర్భిణులు, బాలింతలు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న సీడీపీఓ సముద్రవేణి

లేగదూడల అందాల పోటీలు

నాగాయలంక: జాతీయ పశు కృత్రిమ గర్భధారణ కార్యక్రమంలో భాగంగా బుధవారం స్థానిక మండల పశు వైద్యశాల ఆవరణలో లేగదూడల అందాల పోటీలు జరిగాయి. డీఎల్‌డీఏ కార్యనిర్వహణాధికారి డాక్టర్ శ్రీనివాస్ మాట్లాడుతూ లేగదూడల పెంపకంతో రైతులు ఆర్థిక పరిపుష్టి సాధిస్తారని చెప్పారు. ప్రభుత్వ ఆదేశాల మేరకు పాడి రైతులను ప్రోత్సహించేందుకు లేగదూడల అందాల పోటీలు నిర్వహిస్తున్నామన్నారు. పశుసంవర్థక శాఖ ఉప సంచాలకుడు డాక్టర్ నాగభూషణం మాట్లాడుతూ పశు సంవర్థక శాఖ చేపట్టిన 1962 కాల్‌సెంటర్ సేవలను రైతులు వినియోగించుకోవాలని చెప్పారు. పోటీల ప్రదర్శనకు రైతులు 26 లేగ దూడలను తీసుకురాగా ప్రథమ బహుమతిని రైతు అంబటి ఓమ్ రామ్ హరీష్‌కు అందజేశారు. ద్వితీయ, తృతీయ బహుమతులను తలశిల వెంకటేశ్వరరావు, ఉప్పల శ్రీనివాసరావు గెల్చుకున్నారు. ప్రదర్శనలో పాల్గొన్న రైతులందరికి ప్రోత్సాహక బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ సభ్యుడు మోకా బుచ్చిబాబు, పశువైద్యాధికారి డాక్టర్ మౌనిక, సిబ్బంది, రైతులు పాల్గొన్నారు.



ప్రథమ బహుమతిని రైతుకు అందజేస్తున్న జెడ్పీటీసీ బుచ్చిబాబు, అధికారులు

రేపు 'జగనన్నకు చెబుదాం' ప్రత్యేక గ్రీవెన్స్

కోడూరు: ప్రజా సమస్యల పరిష్కారం కోసం కోడూరు మండలంలో శుక్రవారం 'జగనన్నకు చెబుదాం' ప్రత్యేక గ్రీవెన్స్‌ను నిర్వహించనున్నట్లు తహసీల్దార్ షేక్ లతీఫ్‌పాషా తెలిపారు. బుధవారం స్థానిక కార్యాలయంలో మండలంలోని అన్ని శాఖల అధికారులు, ప్రజాప్రతినిధులతో తహసీల్దార్ ప్రత్యేక సమావేశం నిర్వహించారు. శుక్రవారం ఉదయం 9 గంటలకు స్థానిక దానాశక్తి ఆర్యవైశ్య ప్రార్థనా మందిరంలో జరిగే ప్రత్యేక గ్రీవెన్స్‌లో జిల్లా కలెక్టర్ రాజాబాబు, ఎమ్మెల్యే సింహాద్రి రమేష్‌బాబు పాల్గొంటారని తెలిపారు. మండలంలో ఇప్పటి వరకు 123 సమస్యలకు సంబంధించి స్పందన యాప్‌లో పెండింగ్ చూపుతున్నాయని, వీటిపై సమగ్రంగా చర్చించనున్నారన్నారు. వీటితో పాటు మండల ప్రజలు తమ సమస్యలను నేరుగా కలెక్టర్, ఎమ్మెల్యేకు చెప్పుకోవచ్చని తెలిపారు. జిల్లాకు సంబంధించిన అన్ని శాఖల అధికారులు గ్రీవెన్స్‌లో పాల్గొంటారని, దీనిపై గ్రామాల్లో ప్రజలకు అవగాహన కల్పించాలని తహసీల్దార్ సూచించారు. వలంటీర్లు ప్రతి ఇంటికి వెళ్లి గ్రీవెన్స్ గురించి తెలియజేయడంతో పాటు సమస్యలపైఆరా తీయాలన్నారు. ఎంపీడీఓ శ్రీనివాసరావు, జెడ్పీటీసీ యాదవరెడ్డి వెంకట సత్యనారాయణ, వైస్ ఎంపీపీ ముక్కు వెంకటేశ్వరరావు, ఎంపీటీసీలు పాల్గొన్నారు.

ఖాతాదారులకు మెరుగైన సేవలే లక్ష్యం

నాగాయలంక: ఖాతాదారులకు మెరుగైన సేవలు అందించడమే లక్ష్యమని నాగాయలంక సప్తగిరి గ్రామీణ బ్యాంక్ మేనేజర్ బి.విఠల్ విహారి అన్నారు. ఏపీఎం కడవకొల్లు ఏసుదాస్ అధ్యక్షతన బుధవారం వీఓఏల సమావేశం జరిగింది. విఠల్ విహారి మాట్లాడుతూ తమ బ్యాంక్ సేవలను వివరించారు. వివిధ డిపాజిట్ల ద్వారా అధిక వడ్డీ పొందవచ్చని చెప్పారు. ముద్ర, బంగారు ఆభరణాల కుదువతో రుణాలు, గృహ, వాహన రుణాలు అందుబాటులో ఉన్నాయన్నారు. వివిధ పొదుపు పథకాలపై 8.25 శాతం వడ్డీ లభిస్తుందని వివరించారు.

మచిలీపట్నం ఎస్ఐగా అర్జున్‌రాజు



కోనేరుసెంటర్: మచిలీపట్నం ఎస్ఐగా ఎం. అర్జున్‌రాజు బుధవారం బాధ్యతలు చేపట్టారు. ఇటీవల జిల్లాలో జరిగిన సాధారణ బదిలీల్లో భాగంగా పెనమలూరు పోలీస్‌స్టేషన్‌లో ఎస్ఐగా విధులు నిర్వహిస్తున్న ఆయన మచిలీపట్నం స్టేషన్‌కు బదిలీపై వచ్చారు. బాధ్యతలు చేపట్టిన అనంతరం ఎస్పీ జాషువాను మర్యాదపూర్వకంగా కలుసుకున్నారు. అర్జున్‌రాజును ఎస్పీ అభినందించారు.

30లోగా ఈ-క్రాప్ నమోదు చేయాలి

కోడూరు: ఖరీఫ్ సీజన్‌కు సంబంధించి ఈ నెల 30వ తేదీ లోగా రైతులు ఈ-క్రాప్ నమోదును పూర్తి చేయించుకోవాలని ఏఓ శ్రీధర్ బుధవారం పేర్కొన్నారు. రైతులకు వెసులబాటు కల్పిస్తూ నమోదు ప్రక్రియ గడువును ప్రభుత్వం పెంచిందని, ప్రతి రైతూ తమ పంటకు సంబంధించిన ఈ-క్రాప్ నమోదును తప్పనిసరిగా చేయించుకోవాలన్నారు. విపత్తులు, వర్షాలు, వరదలు సంభవించి పంట దెబ్బతింటే ఈ-క్రాప్‌లో నమోదైన రైతులకు పరిహారం వర్తిస్తుందన్నారు. సచివాలయంలోని వ్యవసాయ సహాయకులను సంప్రదిస్తే వారు ఈ ప్రక్రియను పూర్తి చేస్తారని తెలిపారు.